ఫ్లైఓవర్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కార్పొరేటర్ పద్మతో కలిసి ఛే నంబర్ ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట/కాచిగూడ, జనవరి 6: అంబర్‌పేట ఛే నంబర్‌లో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం ఆయన ఆర్ అండ్ బీ ఈఈ ధర్మారెడ్డి, బాగ్అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. గోల్నాక చర్చి నుంచి ముక్రం హోటల్ వరకు జరుగుతున్న నిర్మాణంలో ఎందుకు ఆలస్యమవుతుందని అధికారులను ఎమ్మెల్యే అడిగారు. ఇంకా పాత కట్టడాలను ఎందుకు క్లియర్ చేయలేదని అన్నారు. అక్విజేషన్ ఎప్పుడు చేస్తారని అడిగారు. వెంటనే నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. అలాగే ఖాద్రిబాగ్ వద్ద గల ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ ఎత్తును కూడా పెంచాలని చెప్పారు. శ్రీరమణ చౌరస్తాలో డ్రైనేజీ వ్యవస్థను సరి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా అక్కడక్కడ మిగిలిపోయిన కట్టడాలను ముందుగా అక్విజేషన్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సరిత, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామమందిరం అభివృద్ధికి కృషి

భగవంతుడిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడ మోతిమార్కెట్‌లోని క్వాలిటీగార్డెన్‌లో శ్రీరామమందిరం మెదటి వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం సుభాష్‌పటేల్ ఆధ్వర్యంలో అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠ పూజిత అక్షింతలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీరాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామమందిరం అభివృద్ధికి బాధ్యతగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్ర బీష్మాదేవ్, రాము, సంతోష్, సుభాష్, సుదర్శన్‌జీ, రవిశంకర్ గౌడ్, పంకజ్, మల్లికార్జున్, అర్వింద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు

సందడిగా వనభోజనాలు

ముషీరాబాద్, జనవరి 6: ముషీరాబాద్ డిపో ఆవరణలో శనివారం ఉద్యోగ, కార్మికుల వనభోజన మహోత్సవాలు సందడిగా సాగాయి. ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల్లో నూతనోత్సాహం నింపే దిశగా ఆర్టీసీ యాజమాన్యం ముషీరాబాద్‌లోని మూడు డిపోల సిబ్బందితో కలిసి వనభోజన మహోత్సవాలను నిర్వహించింది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు ఆటా పాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటేలా వనభోజన మహోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు, రీజనల్ మేనేజర్ వరప్రసాద్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం విజయభాను, డీఆర్ఎం జగన్, డిపో మేనేజర్ కిషన్‌రావు, అసిస్టెంట్ మేనేజన్ కల్యాణి, చందర్, టిఐ-3 స్టేషన్ మేనేజర్ నర్సయ్య గౌడ్ పాల్గొని సందడి చేశారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ జిందాబాద్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 6 : హైదరాబాద్ జిందాబాద్ పౌర సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం టూరిజం సంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి కే వీరయ్య, నాయకులు జే.కే శ్రీనివాస్, కృష్ణమోహన్, ఎం. శ్రీనివాసరావు, పి. శ్రీనివాస్, మోహన్‌నాయుడు, నాగేశ్, రాజమౌళి, గోపాల్, సత్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీశ్

అబిడ్స్, జనవరి 6: ఎన్నికలకు ముందే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన 6 గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీశ్ అన్నారు. నాంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించడం మహిళలంతా కాంగ్రెస్ పార్టీని విశేషంగా ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. మిగిలిన గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజా పాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారిని ఐదు గ్యారంటీలకు ఎంపిక చేసి వారికి లబ్ధి చేకూర్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామన్నారు. రాష్ట్ర నలుమూలలా ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళా లోకమంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. మిగతా ఐదు గ్యారంటీలు త్వరలోనే అమలు చేస్తామని గౌరీ సతీశ్ పేర్కొన్నారు.

కంటి చూపును కాపాడుకోవాలి

కార్వాన్, జనవరి 6: ఫోన్, కంప్యూటర్ల విని యోగం పెరగడం కారణంగా వయస్సుతో సంబంధం లేకుండా అందరికీ కంటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలని మెడివిజన్ కంటి ఆస్పత్రి వైద్యురాలు ఆస్మా అన్నారు. శనివా రం కార్వాన్ యాదవ సం గం, హోలీ క్రాస్ ఫౌండేషన్ సహకారంతో మెడివిజన్ ఆధ్వర్యంలో తాళ్లగడ్డలోని శ్రీ కృష్ణ భవన్‌లో ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడివిజన్ డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార మంత్రి పొంగులేటిని కలిసిన జర్నలిస్టులు

రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు శనివారం రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు ఆనందం, శ్రీనివాస్, కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు తదితరులు ఉన్నారు. – అంబర్‌పేట, జనవరి 6

ప్రజాపాలన కొనసాగించాలి

చిక్కడపల్లి, జనవరి 6 : ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిరంతరం కొనసాగించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. దరఖాస్తుల స్వీకరణ చివరిరోజు కావడంతో శనివారం చిక్కడపల్లి వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమర్హులందరికీ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిరంతరం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

నీలోఫర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నీలోఫర్ దవాఖాన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఉద్యోగులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 6 : నీలోఫర్ దవాఖానలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా ఉన్నతాధికారులు కృషి చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి. రవీందర్ విజ్ఞప్తి చేశారు. నీలోఫర్ దవాఖాన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలు పెంచుతూ ప్రతి నెలా అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈఎస్ఐతో పాటు పీఎఫ్ చెల్లించాలని కోరారు. ఆరోగ్య శ్రీ సిబ్బందికి వేతనంలో 30శాతం ఇంక్రిమెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవును మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి ఎస్. ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఎల్లేశం, నాగేశ్వరరావు, రాజ్‌కుమార్, సురేశ్, శ్రీను నాయక్, నిర్మలదేవి, రేఖ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు

టీఎన్జీవో కేంద్ర సంఘం నాయకులకు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

టీఎన్జీవో నాయకులకు న్యూఇయర్ శుభాకాంక్షలు

సుల్తాన్‌బజార్, జనవరి 6: నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌ను శనివారం రాష్ట్ర టీఎన్జీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి శిక్షణ శాఖ సహాయ శిక్షణాధికారుల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి చాంద్‌పాష, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ దవాఖానలో రోగి సహాయకులకు అన్నదానం

సుల్తాన్‌బజార్, జనవరి 6: ప్రభుత్వ దవాఖానలకు వచ్చే రోగుల సహాయకులకు అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని అన్నారు. ఈ మేరకు శనివారం అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెహదీ నవాబ్ జంగ్(ఎంఎన్‌జే)క్యాన్సర్ దవాఖాన ఆవరణలో సుమారు 500 మందికి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కురాడి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, సంయుక్త కార్యదర్శి ఖాలేద్ అహ్మద్, ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన యూనిట్ కార్యదర్శి బి.శివకుమార్, ఈఎస్ఐ యూనిట్ సభ్యులు రాజ్‌కుమార్, జిల్లా శాఖ ఏపీఆర్వో మహమ్మద్ అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ

అబిడ్స్, జనవరి 6 : అయోధ్య అక్షింతలను గుడిమల్కాపూర్ మహేశ్‌నగర్ కాలనీలో ఇంటింటా పంపిణీ చేశారు. శనివారం జైశ్రీరామ్ నినాదాలతో మహేశ్ నగర్‌కాలనీ మర్మోగింది. ఒక రథంలో అయోధ్య అక్షింతలను తీసుకొని ప్రతి ఇంటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్య సంబరాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పట్నం సుబ్బారావు, అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాది రాజశేఖర్, ముల్లే రాకేశ్, నరసింహాగౌడ్, సీహెచ్ ప్రదీప్‌కుమార్, గౌరిగే శ్రీనివాస్, శ్రీధర్, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్ కుమార్, రఘు, కిశోర్ గుప్తా కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. 500 సంవత్సరాల తర్వాత ప్రారంభమవుతున్న ఈ వేడుకను ప్రతి ఇంటిలో ఐదు దీపాలను వెలిగించాలని అన్నారు.

అయోధ్య రాములవారి అక్షింతల ఊరేగింపు

మెహిదీపట్నం జనవరి 6: లంగర్‌హౌస్ డివిజన్ రాందాస్‌పురా లలితానగర్‌లో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో శనివారం అక్షింతల ఊరేగింపు, సీతారాముల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సి. ఉదయ్‌కుమార్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, ఉమారాణి, వినేష్‌సింగ్, పూర్ణచందర్‌రావు, నాగేంద్రప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు శశికాంత్ తివారీ, రవికాంత్ తివారీ ఆధ్వర్యంలో ఇంటింటికీ రాముల వారి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగాలు ఇచ్చే దిశగా ముందుకు సాగాలి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 6: ఉద్యోగాలు సాధించడంతో పాటు ఉపాధి అందించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి. లక్ష్మీనారాయణ సూచించారు. అబిడ్స్ మెథడిస్ట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ గ్రాడ్యుయేషన్ వేడుకలు శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయపాలన, క్రమశిక్షణతో ప్రయత్నం చేస్తే అనుకున్న లక్ష్యం సులభతరం అవుతుందన్నారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఈ వేడుకల్లో 700మందికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఉస్మానియాయూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి రాములు, కళాశాల చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్లు ప్రదీప్‌రెడ్డి, రామకేశ్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు జి.బెనకోప్, కన్వీనర్ డాక్టర్ వై. మస్తానమ్మ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.సచేంద్రనాథ్, పీఆర్ఓ శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

ముషీరాబాద్, జనవరి 6: జీహెచ్ఎంసీ సర్కిల్-15 ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారంతో ముగిసింది. పది రోజుల పాటు సాగిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాల కోసం 76,674 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆరు గ్యారంటీల కోసం 59,907 మంది దరఖాస్తు చేసుకోగా ఇతర పథకాలు, రేషన్ కార్డుల కోసం కొత్తగా 16,767 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తంగా నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో 76,674 దరఖాస్తులు వచ్చినట్లు సర్కిల్-15 డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ముందుకువెళ్లనున్నట్లు చెప్పారు.

బాలనంద సంఘంలో డ్రాయింగ్ పోటీలు

కాచిగూడ, జనవరి 6: తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చిత్ర కళాకారిణి మహాలక్ష్మి సూచించారు. ఆంధ్ర బాలానంద సంఘం అధ్యక్షురాలు జె.వి.కామేశ్వరి ఆధ్వర్యంలో బాలానంద సంఘంలో బాలబాలికలకు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. తెలంగాణ విశిష్టత, సంస్కృతి, సంప్రదాయలను తెలుసుకోవాల్సిన అవసరం విద్యార్థులపై ఉందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి స్వర్ణబాల, సరసి, రాంబాబు, లావణ్య పాల్గొన్నారు.

ముదిరాజ్ సమస్యలపై మంత్రికి విజ్ఞప్తి

అబిడ్స్, జనవరి 6: ముదిరాజ్ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి శ్రీనివాస్‌రెడ్డిని ముదిరాజ్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పొట్ల కాయల వెంకటేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్, హైకోర్టు న్యాయవాది ఉపాధ్యక్షులు ఆలేటి సురేశ్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



జాబ్ మేళాలో ఆఫర్ లెటర్లు అందజేత

మాసాబ్‌ట్యాంక్‌లోని ఖాజామాన్షన్ ఫంక్షన్‌హాల్‌లో 'డెక్కన్ బ్లాస్టర్స్' ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. వివిధ కార్పొరేట్ కంపెనీ పాల్గొని నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించి ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సలహా బోర్డు చైర్మన్ షేక్ ఫరీద్, అఫ్కర్ షరీఫ్, మహ్మద్ ఇమ్రాన్ హుస్సేన్, నిర్వాహకులు మన్నన్ ఖాన్ పాల్గొన్నారు. – అబిడ్స్, జనవరి 6

బాలమురళి సంపుటి ఆవిష్కరణ

ముషీరాబాద్, జనవరి 6: బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీరాగ సినీ మ్యూజికల్ ఆర్కెస్ట్రా సాంస్కృతిక సంస్థల వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం చిక్కడపల్లి కళా సుబ్బారావు కళావేదికలో రచయిత డీవీవీఎస్ నారాయణ సంకలనం చేసిన సంగీత స్వరనిధి బాలమురళి సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు, విశ్రాంత అధికారి పల్లా సోమసుందర శర్మ, అన్నమయ్య సంకీర్తనల పరిశోధకుడు నాగరాజులు పాల్గొని స్వరనిధి బాలమురళి సంపుటిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన

కార్వాన్, డిసెంబర్6 : తాళ్లగడ్డ ప్రధాన రోడ్డులో ఉన్న ప్రాచీనమైన బొడ్డురాయి నాభిశిలను తొలగించి దాని స్థానంలో నూతన బొడ్డురాయిని ప్రతిష్ఠించారు. ఈ పూజలు గురువారం ప్రారంభమవగా శనివారం భక్తుల కోలాహలం మధ్య బొడ్రాయి నాభిశిలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా జలాభిషేకం, జలాధివాసంతో పాటు హోమం, అన్న ప్రసాద వితరణ, అతిథులకు సన్మానం నిర్వహించారు. ఈ పూజల్లో నిర్వాహకులతో పాటు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయం

సుల్తాన్‌బజార్, జనవరి 6: నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధిని కల్పించాలనే ధ్యేయంతోనే మెగా జాబ్ ఫేయిర్‌ను నిర్వహించామని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఈ మేరకు శనివారం విజయనగర్ కాలనీ డివిజన్ పరిధిలోని మల్లేపల్లి ఐటీఐ ప్రాంగణంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌ఫేయిర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జాబ్ ఫేయిర్‌ను ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫేయిర్‌ను నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ జాబ్ ఫేయి ర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే ఎంపిక చేసిన సంస్థలు వారి వారి విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ పుష్పాల జ్యోతిరాణితో పాటు ఐటీఐ శిక్షణాధికారులు, సహాయ శిక్షణాధికారులు, అభ్యర్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం ఓఎస్‌డీ వేములకు సత్కారం

అబిడ్స్, జనవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీగా నియమితులైన రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాస్‌ను సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రహమత్ అలీ, అసోసియేట్ అధ్యక్షులు హరిప్రసాద్, కోశాధికారి దేవుపల్లి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ఎం. మధు ఆయనకు శనివారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



ప్రభుత్వం ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయాభివృద్ధికి కార్యక్రమాలను చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. శనివారం తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు డి. వైద్యనాథ్, ప్రధాన క్యాదదర్శి జి. కృపాకర్‌రెడ్డి శనివారం మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – చిక్కడపల్లి, జనవరి 6

ఆకట్టుకున్న నాట్యం

రవీంద్రభారతి, జనవరి 6: ప్రముఖ నాట్యగురువు పూర్వ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి శిష్యురాలు హెత్విత నల్లారి ప్రదర్శించిన నాట్యాంశాలు కళాప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం దీపాంజలి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో హెత్విత కూచిపూడి రంగ ప్రవేశం కనుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జాతీయ నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఆదుకోవాలి

రవీంద్రభారతి, జనవరి 6: విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు ఆర్థికంగా, రాజకీయంగా చాలా వెనుకబాటుకు గురయ్యారని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం బీసీ సాధికారిత భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మధన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు వెంకటాచారి మాట్లాడుతూ.. నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి రవీంద్రాచారి, ఆర్.విష్ణుచారి, ఎర్రోజు వేణుగోపాల్, చంద్రమౌళి, నాగారం భాస్కరాచారి పాల్గొన్నారు.

మాస్టర్ చెఫ్ నారాయణ

అంబర్‌పేట, జనవరి 6: బాగ్‌అంబర్‌పేట డీడీ కాలనీలోని నారాయణ ఈ-టెక్నో స్కూల్‌లో శనివారం 'మాస్టర్ చెఫ్ నారాయణ' కార్యక్రమం సందడిగా జరిగింది. ముఖ్య అతిథిగా జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వంటకాలతో చెఫ్ వేశాధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డీ మహేశ్వరి, కో-ఆర్డినేటర్ లక్ష్మీభవానిష ప్రిన్సిపాల్ టి. మౌనిస్టాలిన్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శ్రీ మహంకాళికి పూజలు

చాంద్రాయణగుట్ట, జనవరి 6: నూతన సంవత్సరం సందర్భంగా లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయంలో శనివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఛత్రినాక ఏసీపీ రమేశ్, చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ భోజ్యానాయక్ అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కాశీనాథ్ గౌడ్, విష్ణుగౌడ్, బద్రీనాథ్‌గౌడ్, రంగ హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శన

అబిడ్స్, జనవరి 6 : డైమండ్ జూబ్లీ హై స్కూల్‌లో 'ఎజర్నీ ఎమాంగ్ ది స్టార్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నాంపల్లిలోని స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల కన్వీనర్ అలీవా, డైరెక్టర్ నూర్దిన్‌దమాని, ఆగాఖాన్ హాస్టల్ హెడ్ అలియా పర్వీన్, ప్రిన్సిపాల్ సుజాతగడేతో కలిసి ప్రారంభించారు. మొదటి రోజు 37 పాఠశాలలకు చెందిన 3000 మంది విద్యార్థులు తిలకించారు. ఆదివారం కూడా కార్యక్రమం కొనసాగుతుందని ప్రిన్సిపాల్ సుజాతగడే వెల్లడించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జియాగూడ, జనవరి 6: జియాగూడ డివిజన్ కేశవస్వామినగర్ కురుమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ హాజరై సంఘం అధ్యక్షుడు జె. రామేశ్, ప్రధాన కార్యదర్శి సుక్క నర్సింహ్ములు, కోశాధికారి బి. యాదయ్యలతో కలిసి 2024 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

అభివృద్ధిని అందించాలి

మెహిదీపట్నం జనవరి 6: ప్రజలకు అభివృద్ధిని అందించడానికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్‌లలో ఆయన జలమండలి డీజీఎం జవహర్‌అలీ, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సీవరేజీ పైపులైన్లు, వీడీసీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మృతదేహం లభ్యం

కవాడిగూడ, జనవరి 6: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గాంధీనగర్ పోలీసులు శనివారం తెలిపారు. ఎస్ఐ నాగరాజురెడ్డి కథనం ప్రకారం.. గాంధీ దవాఖాన ఎదురుగా ఉన్న 1036 హెచ్ఎంఆర్ఎల్ పిల్లర్ సమీపంలో ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం పడి ఉన్నదని, వయస్సు (45) ఉంటుందని తెలిపారు. బూడిద రంగు చొక్క, మిశ్రమ రంగు బెడ్‌షీట్‌తో మృతదేహం కప్పబడి ఉన్నదని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి ఆచూకీ తెలిస్తే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కార్వాన్, జనవరి 6 : టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని కుల్సుంపురా ప్రభుత్వ పాఠశాల సమీపంలో సమారు 60 ఏండ్ల వయసున్న ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన చోటు చేసుకున్నది. సమాచారం అందుకున్న ఎస్ఐ అంబేడ్కర్ మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు భిక్షాటన చేస్తుంటాడని, ఇతని సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

కాచిగూడ,జనవరి 6: వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప కథనం ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి(35)మలక్‌పేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం-2లో శనివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీన పర్చుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై గ్రే రంగు టీషర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి, ఎత్తు 5.7 ఉన్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 871 2658584లో సంప్రదించాలని రైల్వే సీఐ కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.